క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

గద్వాల రూరల్: కొన్నేళ్లుగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించాలని జిల్లా పెన్షనర్ల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈహెచ్ఎస్, కమ్యూటేషన్, డీఆర్ వంటి సమస్యలను పరిష్కరించాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు లక్ష్మీరెడ్డి, వసంతరాయుడు, రామన్‌గౌడ్, హనుమంతు, బాల్‌రాజు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



మానవపాడు: ప్రయణం చేసే వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్, కొర్విపాడు స్టేజీలలో వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా ఉండాలంటే వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణించరాదని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.

మరమ్మతు పూర్తి చేయాలి



మానవపాడు: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయాలని డీఈ ఆంజనేయులు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని దళితవాడ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ శివప్రసాద్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల భద్రతే సఖి లక్ష్యం



మల్దకల్: బాలికలకు అన్ని విధాల భద్రత కల్పించడమే సఖి ప్రధాన లక్ష్యమని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, సఖి నిర్వాహకురాలు శోభ అన్నారు. గురువారం మల్దకల్ హైస్కూల్‌లో విద్యార్థులతో సఖి నిర్వాహకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గృహహింస, వరకట్న వేధింపులు, ఆడపిల్లల అక్రమ రవాణా, అమ్మకం, లైంగిక వేధింపులు వంటివి చట్టరీత్యా నేరమన్నారు. మహిళలకు సఖి అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సురేష్, జ్యోత్స్న, సరోజ, సరాగిణి, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, జ్యోతి, శుభ, రమణమ్మ, సుహాసిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

మానవపాడు: జాతీయ రహదారి–44పై గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీ కొట్టిన ఘటన మండలంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రాజు, అజయ్ వ్యక్తిగత పనుల నిమిత్తం కర్నూల్‌కు వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారి–44పై జల్లాపురం శివారులో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

ఎర్రవల్లిచౌరస్తా: రహస్యంగా పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై ఇటిక్యాల పోలీసులు మెరుపు దాడి చేశారు. ఎస్ఐ వెంకటేష్ వివరాల ప్రకారం.. ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో బుధవారం రాత్రి పేకాడుతున్నట్లు నమ్మదగిన సమాచారం వచ్చింది. దీంతో సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 14 ద్విచక్ర వాహనాలు, 4సెల్‌ఫోన్లు, రూ. 3,125 నగదుతో పాటు ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల ను గమనించిన కొందరు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి



గద్వాల అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు నరేష్, ప్రవీణ్ ఉన్నారు.

సమస్యల వలయంలో ఆస్పత్రి



మల్దకల్‌లో గదుల కొరత వల్ల చెట్ల కింద సమావేశం నిర్వహిస్తున్న డాక్టరు స్వరూపరాణి (ఫైల్)

- రోగులు, గర్భిణులు, బాలింతలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. 22 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గ్రామానికి దూరంగా నిర్మించడంతో రోగులు ఆస్పత్రికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో సరైన వసతులు లేవు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన చేతిపంపు చెడిపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. ఆస్పత్రి అభివృద్ధి కోసం వస్తున్న నిధులు దేనికి ఖర్చు చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఆస్పత్రికి పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు, గొర్రెలు సంచరిస్తున్నాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో వైద్యసిబ్బందికి సరైన గదులు లేవు. ప్రసూతిగదిలో సరైన వసతులు లేకపోవడం గమనార్హం. ప్రతినెల వైద్యసిబ్బందితో ఏర్పాటు చేసే సమావేశాలకు గదులు లేకపోవడంతో ఆస్పత్రి ఆవరణలోనే చెట్ల కింద సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.



మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రతి రోజు ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రహరీ పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు సంచరిస్తున్నాయి. అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– రామలింగం, మల్దకల్

గదుల సంఖ్యను పెంచాలి



ఆస్పత్రిలో రోగులకు సరిపడు గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సీజనల్ కాలం కావడంతో ఎక్కువ సంఖ్యలో రోగులు ఆస్పత్రికి రావడంతో ఇరుకుగా ఉండే గదులతో పాటు ఆరుబయట చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. గదుల సంఖ్యను పెంచి రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

– సవారమ్మ, అమరవాయి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలన్నింటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని జిల్లా డీఎంహెచ్‌ఓ, రాష్ట్ర వైద్యశాఖ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తా.

– స్వరూపరాణి, డాక్టర్ మల్దకల్

పేదలకు అండగా సీఎం సహాయ నిధి

- ఎమ్మెల్యే విజయుడు.

ఎర్రవల్లిచౌరస్తా: పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం సహాయ నిధి ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని వివిధ గ్రామాలను ఆయన సందర్శించారు. రూ. 3,09,500 విలువైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పెద్దదిన్నెలో కుర్వ తిమ్మన్నకు రూ.2లక్షలు, తిమ్మాపురంలో భగవాన్‌కు రూ. 16,500, ధర్మవరంలో బోయ విష్ణువర్ధన్‌కు రూ.23 వేలు, వేములలో వడ్డె సుధాకర్‌కు రూ.5వేలు, వల్లూరులో రామ గోవిందుకు రూ. 27వేలు, రాజశ్రీ గార్లపాడులో తెల్లు కర్రె బీసన్నకు రూ.38 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రాందేవ్‌రెడ్డి, మల్లేష్, ఉస్సేన్, లక్ష్మీనారాయణ, బాలకృష్ణారెడ్డి, గిడ్డారెడ్డి, కిశోర్ ఉన్నారు.



వల్లూరులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి శశికళ

గద్వాల క్రైం: అంతర్జాతీయ జనాభా దినోత్సవాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పుర వీధుల్లో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి శశికళ మాట్లాడారు. జనాభా పెరుగుదల, ఫలితంగా జరిగే పరిణామాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. అంతకు ముందు కుటుంబ నియంత్రణ విభాగంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి నగదు అందజేశారు. అనంతరం జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో సిబ్బంది సిద్దప్ప, ఇర్షాద్, రాజు, కిరణ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పీడీఎస్‌యూ కార్యవర్గం ఎన్నిక

అయిజ: ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం మండల నూతన కమిటీని గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హాలీంపాష, జిల్లా కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, హరిహర జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. పీడీఎస్‌యూ మండల అధ్యక్షుడిగా మహేష్, ఉపాధ్యక్షుడిగా సూరి, కార్యదర్శిగా రఘు, సహాయ కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా వీరేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గోవిందు, రాంచరణ్, తిమ్మప్ప, చంద్రశేఖర్, నవీన్, ప్రసాద్, శివకుమార్, ప్రసాద్ గౌడ్, వినోద్ పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన పీడీఎస్‌యూ మండల కార్యవర్గ సభ్యులు

నిందితులను కఠినంగా శిక్షించాలి



పైపాడులో నిరసన చేపడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

శాంతినగర్: చిన్నారి వాసంతిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వాల్మీకి సంఘం తెలంగాణ కార్యదర్శి పైపాడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని పైపాడులోని వాల్మీకి ఆలయ ప్రాంగణంలో చిన్నారి వాసంతి హత్యను ఖండిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా పగిడాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన చిన్నారి వాసంతిని దుండగులు హత్యచేయడం క్రూరమైన చర్య అని, నరహంతకులను వెంటనే బహిరంగంగా ఎన్‌కౌంటర్ చేయాలన్నారు. తక్షణమే బాధిత కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అలంపూర్ వాల్మీకి సంఘం ప్రధాన కార్యదర్శి బోయ వెంకటేశ్వర్లు, మద్దిలేటి, రాముడు, శివుడు, నరసింహ, గోపాలకృష్ణ, చిన్న మద్దిలేటి, వెంకటేష్, బజారమ్మ, పరశురాముడు, మద్దమ్మ, నాగరాజు, చిన్న మాదన్న, నడిపి బీసన్నలు పాల్గొన్నారు.

సహకార సంఘాలతోనే రైతుల అభివృద్ధి

అయిజ: ఎలాంటి అండాలేని రైతులకు సహకార సంఘాలు అండగా నిలుస్తున్నాయని, వారి అభ్యున్నతికోసం కృషి చేస్తున్నాయని ఇండియన్ ఫార్మర్స్, ఫర్టిలైజర్ కో–ఆపరేటివ్ లిమిటెడ్ (ఐఎఫ్ఎఫ్‌సీఓ) తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ కృపాశంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంను, సూపర్ మార్కెట్‌ను కృపాశంకర్ పరిశీలించారు. సింగిల్ విండో పనితీరు గురించి పీఏసీఎస్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో మొట్టమొదటిసారి నానో యూరియా, నానో డీఏపీ లాంటి లిక్విడ్ ఫర్టిలైజర్‌ను తయారుచేసి అందించిన ఘనత ఇఫ్కో సంస్థదే అన్నారు. రైతులకు నానో ఫర్టిలైజర్, సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించేందుకు త్వరలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సును ఇఫ్కో సంస్థ ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ గురురాజ్, ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్, సొసైటీ సిబ్బంది నరహరి, భీమార్జున్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సూపర్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఐఎఫ్ఎఫ్‌సీఓ తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ కృపాశంకర్

సీసీరోడ్లు నిర్మించండి



అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో పారిశుద్ధ్యం లోపించిందని, వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు అధికారులను కోరారు. గురువారం 6వ వార్డులో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, మున్సిపల్ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు అధికారులకు ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఏకరువుపెట్టారు. సీసీ రోడ్లు, లేకపోవడంతో వర్షంనీరు రోడ్లపై నిలిచి చిత్తడిగా మారుతుందన్నారు. డ్రెయినేజీలు నిర్మించక పోవడంతో నివాసగృహాల నుంచి వచ్చే వ్యర్థం నీరు ఇండ్ల ముందే నిలిచి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. మున్సిపాలిటీలో నిధుల కొరత ఉందని, తాత్కాలికంగా మొర్రం వేసి సమస్యను కొంతమేరకు తగ్గిస్తామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్‌లు విజయ్, పవన్, మున్సిల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ కూడలిని అభివృద్ధి చేయండి



శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ అంబేడ్కర్ కూడలిని విశాలంగా చేయడంతో పాటు అభివృద్ధి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో రాజోళివైపు, కోయిల్‌దిన్నె వైపు, రాయచూర్–కర్నూల్ ప్రధాన రహదారి ఉండటంతో వాహనాల రద్దీ ఉంటోంది. పట్టణ ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం దుకాణాలకు వెళ్తుంటారు. ప్రధాన కూడలిలో తరచూ ప్రమాదాలు సంభవిస్తుండడంతో పోలీసులు బార్కెడ్ ఏర్పాటు చేశారు. దీంతో చౌరస్తా ఇరుకుగా మారిందని స్థానికులు వాపోతున్నారు. పాదచారులు రోడ్డుపై వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. వారాంతపు సంత శుక్రవారం రోడ్డుకు ఇరువైపుల దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇరువైపుల అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులను వెంటనే చేపట్టి కూడలిని వెడల్పుగా మార్చి ఇబ్బందులు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని జింకలపల్లికి చెందిన ముష్టి లచ్చమ్మ అకాల మరణం చెందింది. ఈ విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం ట్రస్ట్ చైర్మన్ సోమనాద్రి గురువారం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట వెంకటేష్, భాస్కర్ ఉన్నారు.

జీపీ కార్మికుల వేతనాలు విడుదల చేయాలి



ఎర్రవల్లిచౌరస్తా: కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ వర్కర్ల జీతాలను వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తిక్ డిమాండ్ చేశారు. గురువారం ఎర్రవల్లి చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ పనికి తగిన వేతనం ఇవ్వకుండా జీపీ కార్మికులతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందన్నారు. జీపీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెంటనే తీర్చాలని కోరారు. అనంతరం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు మధు, శ్రీనివాసులు, రాజు, తిమ్మప్ప ఉన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే



ధరూరు ఉన్నత పాఠశాలలో సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చి దిద్దేది తల్లి దండ్రుల తరువాత ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన బదిలీ, ప్రమోషన్‌పై వెళ్తున్న ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అంతకు ముందు పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహానికి పూలమాల వేశారు. ఇంటర్నెట్ ఫలితాల్లో ధరూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపడం సంతోషకరమన్నారు. 10వ తరగతి పూర్తయిన విద్యార్థులు స్థానికంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకోవచ్చన్నారు. గద్వాలలో మెడికల్ కళాశాల త్వరలో ప్రారంభించడం జరుగుతుందని, అక్కడే నర్సింగ్ కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో అనువుగా ఉంటుందన్నారు. భవిష్యత్‌లో గద్వాలకు ఇంజినీరింగ్, అగ్రికల్చర్ కళాశాలలు వచ్చే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. చదువుకున్న పాఠశాలకు, విద్యా బుద్ధులు నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని, తల్లిదండ్రులను ఎలాంటి కష్టం రాకుండా చూసుకోవాలన్నారు. పాఠశాల జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్ విజయ్ కుమార్, రాములు, మాజీ ఎంపీటీసీ డొలన్న పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవన విధానం పాటించాలి

గద్వాలన్యూటౌన్: విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించాలని విద్యాశాఖ జిల్లా సమన్వయకర్త ఎస్తేర్‌రాణి అన్నారు. గురువారం స్థానిక బాలభవన్‌లో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో 'అంతర్జాల పరికరాలు–ఆరోగ్యకర జీవనవిధానం' అనే అంశంపై విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి ఉండవెల్లి కేజీబీవీ విద్యార్థిని సాయితేజ, రెండో బహుమతి ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల విద్యార్థిని హారిక, మూడో బహుమతి అమరవాయి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఇందులు సాధించారు. ఈ సందర్భంగా వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఎస్తేర్ రాణి మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవాలన్నారు. జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జనాభా–విద్యా ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎన్జీసీ జిల్లా సమన్వయకర్త శ్రీధర్, ఉపాధ్యాయులు శోభారాణి, సుధాకర్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థినులతో జిల్లా సమన్వయకర్త ఎస్తేర్‌రాణి, ఉపాధ్యాయులు

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



వైఎస్సార్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

గద్వాల అర్బన్: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్లను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థులను వేధించడం సరికాదన్నారు. జిల్లాలో బీసీ విద్యార్థులకు సంబంధించి రూ.5.70కోట్లు, ఎస్సీ విద్యార్థులకు రూ.48లక్షల స్కాలర్‌షిప్స్, రియింబర్స్‌మెంట్ పెండింగ్ ఉన్నాయని, దీంతో విద్యార్థులు ఎలా చదువుకోవాలని నిలదీశారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడం వల్ల విద్యారంగ సమస్యలు సీఎం దృష్టికి వెళ్లడం లేదని, వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు తిరుమలేష్, శివ, పవన్‌కుమార్, చరణ్, చంద్రకాంత్ ఉన్నారు.

అంతర్‌జిల్లా ఫుట్‌బాల్ టోర్నీకి గద్వాల విద్యార్థులు

గద్వాల న్యూటౌన్: అంతర్‌జిల్లా సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీకి స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మాణిక్య, శ్రీవిద్య, స్వాతి ఎంపికయ్యారు. ఈ టోర్నీకి సంబంధించి జూలై 7న వనపర్తి జిల్లా పెబ్బేరులో ట్రయల్స్ నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు కల్వకుర్తిలో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. టోర్నీకి ఎంపికైన విద్యార్థులను గురువారం పాఠశాలలో హెచ్ఎం జహురుద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ స్రవంతి అభినందించారు.



విద్యార్థినులతో పాఠశాల హెచ్ఎం జహురుద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ స్రవంతి

పేదలకు వైద్యసేవలు అందడం లేదు



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు వైద్యసేవలు అందించడంలో విఫలమైందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఎస్పీ కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. రాష్ట్రంలో పేదలకు సరైన విద్య, వైద్యం అందించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. గ్రామాల్లో వైద్యసేవలు అందించేందుకు నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను రద్దు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. వైద్య విధాన పరిషత్‌లో ఉండే కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఏరియా ఆస్పత్రులను పూర్తిగా తొలగించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. పేదలకు న్యాయం జరగకుంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్, గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు, ఉపాధ్యక్షుడు సవరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి



సన్మానం పొందిన ఉపాధ్యాయులు



మానవపాడులో..

అయిజ: విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులు తీసుకుంటారని, వారి సేవలు మరువలేనివని తల్లిదండ్రులు కొనియాడారు. యాపదిన్నెలో ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య, ఉపాధ్యాయులు భీముడు, సతీష్‌లు బదిలీ కావడంతో వారిని శాలవాలు, పూలమాలలతో సత్కరించారు. వచ్చే ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చి దిద్దాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పుష్పలత, ఉపాధ్యాయులు రాజేష్, లక్ష్మణ్, సూర్యశేఖర్, అనురాధ, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీదేవమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని దళితవాడలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ అయ్యారు. ఎంఈఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఆనందం, పుష్పకుమారిలను పూలమాల, శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు బదిలీ కావడంతో వారిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.